

మింట్‌కాంపౌండ్‌లో కంటైనర్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా క్యాంటీన్

# ఐదు రూపాయలకే ఇడ్లీ,పూరీ,వడ,ఉప్మా

- జిహెచ్‌ఎంసి ఇందిరా క్యాంటిన్‌లలో టిఫిన్స్
- ఉదయం బ్రేక్‌పాస్ట్.. మధ్యాహ్నం భోజనం
- హరేకృష్ణ మూవ్‌మెంట్ భాగస్వామ్యంతో నిర్వాహణ
- రూ.11.43కోట్లతో 130 ప్రాంతాల్లో కంటైనర్ల ఏర్పాటుకు చర్యలు

**హైదరాబాద్,జూలై 10,ప్రభాతవార్త:** ఇందిరా క్యాంటీన్లలో ఇక నుంచి టిఫిన్స్ కూడా అందించనున్నారు. ఉదయం టిఫిన్లలో ఇడ్లీ, పూరి,వడ ,ఉప్మా, పొంగల్ వంటిని అందించేందుకు జీహెచ్‌ఎంసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. మరికొద్దిరోజుల్లోనే దీన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఒక్కో ప్లేట్ టిఫిన్ కోసం మొత్తం రూ.19 ఖర్చు చేయాలని నిర్ణయించగా దీనిలో జీహెచ్‌ఎంసీ వాటాగా రూ.14 చెల్లించాల్సి ఉంది. ఇందిరమ్మ క్యాంటీన్లలో టిఫిన్, భోజనాలు అందించేందుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నవిషయం తెలిసిందే. అయితే టిఫిన్స్ ఏర్పాటు చేయడానికి ఏడాదికి రూ.10 కోట్లు ఖర్చు అవుతుందని, ప్రతి రోజూ 25వేల మందికి టిఫిన్స్ అందించనున్నట్టు అధికారులు చెబుతున్నారు. అలాగే ఇందిరా క్యాంటీన్ల రూపురేఖలు మార్చేందుకు జీహెచ్‌ఎంసీ డిజైన్లు రూపొందించింది. గతంలో మురికి కూపంగా ఉన్న కేంద్రాలను మోడ్రన్‌గా మార్చాలని నిర్ణయించారు. లబ్ధిదారులు కూర్చొని తినే విధంగా సీటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 150 కేంద్రాలకుగాను 40 కేంద్రాల్లో ఇందిరా క్యాంటీన్లను 40 ఫీట్ల పొడవు, 10 ఫీట్ల వెడల్పు ఒక మోడల్లో, 99 కేంద్రాల్లో 20 ఫీట్ల పొడవు, 10 ఫీట్ల వెడల్పుతో మరో మోడల్ రూపొందించారు. వీటితోపాటు మరో 11 కేంద్రాలకు మరమ్మ తులు చేయాలని నిర్ణయించారు. 150 కేంద్రాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి సుమారు రూ.10.7కోట్లు అవుతుందని అందులో 130 ప్రాంతాల్లో కంటైనర్లను ఏరానపటు చేయాలని నిర్ణయించారు.

**యథావిధిగా భోజనం..**

గ్రేటర్ హైదరాబాద్లో ఎంతో మంది ఆకలి తీర్చుతున్న రూ.5 భోజనపథకం యథావిధిగా కొనసాగుతుంది. కానీ వీటిని ఇందిరా క్యాంటీన్లుగా మార్చడంతోపాటు వాటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది.వీటిని పూర్తిస్థాయిలో మార్చాలని, ప్రతి క్యాంటీన్లో కూర్చొని తినే విధంగా సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో అందిస్తున్న రూ.5 భోజనంలో 400 గ్రాముల రైస్, సాంబారు 120 గ్రాములు, సబ్జీ 100 గ్రాములు, పికిల్ 15 గ్రామలు అందిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో 150 కేంద్రాల్లో ప్రతి రోజూ సుమారు 30 వేల మంది భోజనం చేస్తున్నారు. ఒక్కో భోజనానికి రూ.27.63 ఖర్చు చేస్తుండగా దీనిలో రూ.5 లబ్ధిదారుడు నుంచి వసూలు చేస్తే మిగిలిన డబ్బును జీహెచ్‌ఎంసీ చెల్లిస్తోంది. ఈ పథకానికి ప్రతీ ఏటా జీహెచ్‌ఎంసీ సుమారు రూ.15 కోట్లు ఖర్చు చేస్తోంది.పదేండ్ల కాలంలో సుమారు రూ.247 కోట్లు ఖర్చు చేయడంతోపాటు 12 కోట్లకుపైగా మందికి భోజనాలు అందించారు.

# కూకట్‌పల్లిలో జోరుగా కల్తీకల్లు విక్రయాలు...

**-కల్తీ కల్లుకు బానిసై అనారోగ్యాలకు గురవుతున్న బాధితులు...**

**కెపిహెచ్బి కాలనీ, జూలై 10, ప్రభాతవార్త** కల్లుకు బానిసలవుతున్న అమాయక ప్రజలను ఆసరాగా చేసుకుంటూ కొంతమంది వ్యాపారులు కల్తీ కళ్ళు విక్రాలను జోరుగా కొనసాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పవిత్రమైన గీతవృత్తికి కళంకం తెచ్చే నకిలీ వ్యాపారులు గీత కార్మికుల ముసుగులో నకిలీల కళ్ళు దందాలకు పాల్పడుతూ కోట్ల రూపాయలు అక్రమంగా దోచుకుంటున్నారు. ప్రధానంగా కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహిస్తున్న కళ్ళు కాంపౌండ్లలో కల్తీకల్లు విక్రయాలు పెద్ద మొత్తంలో కొనసాగుతున్నాయి. గతంలో సైతం కల్తీ కళ్ళు బారిన పడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోగా పలువురు ఆసుపత్రి పాలైన సంఘటనలు జరిగాయి. కూకట్‌పల్లిలోని పలు ప్రాంతాలలో పేద మధ్యతరగతి ప్రజలకు కల్తీ కల్లు విక్రయిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారు. ప్రమాదకరమైన క్లోరల్ హైడ్రేటు, డైజోఫాం, సిట్రస్ యాసిడ్ లాంటి రసాయనాలను నగర శివారు పారిశ్రామిక వాడల లోని కొన్ని పరిశ్రమల నుంచి చాటుగా కొనుగోలు చేసి కల్తీ కల్లు తయారీకి ఉపయోగిస్తున్నారు. ఈ దందాలు తెలిసి కూడా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు లంచాలకు మరిగి ఈ కల్తీ వ్యాపారాన్ని నిర్మూలించకపోవడంతో ఎన్నో కుటుంబాలు అనారోగ్యాలు బారిన పడి ఆర్థికంగా చితికి పోతున్నాయి. గత రెండు రోజుల క్రితం కూకట్‌పల్లిలోని మూడు కళ్ళు కాంపౌండ్లలో జరిగిన కల్తీకల్లు సేవించిన సంఘటనలో దాదాపు ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం విచారకరం. ఇప్పటికైనా నకిలీ గీత కార్మికుల ఆగడాలను అరికట్టకపోతే మునుముందు మరెన్నో ఘోరాలను చూడాల్సి వస్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కొల్లూరులో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన పిఎంవో డైరెక్టర్ మన్మిత్ కౌర్


డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నమూనాలను పరిశీలిస్తున్న మన్మిత్‌కౌర్, కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు

**హైదరాబాద్, జూలై 10, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి కార్యాలయంలో డైరెక్టర్‌గా పని చేస్తున్న మన్మీత్ కౌర్ రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గురువారం జీహెచ్ ఎంసీ పరిధిలోని పలు 2బిహెచ్‌కే గృహ నిర్మాణ ప్రాజెక్టులను పరిశీలించారు. కొల్లూరు ఫేస్2లో నిర్మించిన 15,660 గృహాలు, అలాగే దూలనాగపల్లి లో నిర్మించిన 1,544 గృహాలను స్వయంగా సందర్శించారు. ఆమె వెంట జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్, హౌసింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. పరిశీలన సందర్భంగా లబ్ధిదారులతో ప్రత్యక్షంగా ముఖాముఖీ చర్చించి, వారికి అందుతున్న వసతులు, ఆరోగ్య సేవలు, విద్యా సౌకర్యాలు ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలను తెలుసుకున్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హెల్త్ సెంటర్ల గురించి లబ్ధిదారుల అభిప్రాయాలు స్వీకరించారు. బుధవారం న్యూఢిల్లీ నుండి హైదరాబాద్‌కు వచ్చిన డైరెక్టర్‌కు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఇలాంబర్తి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హౌసింగ్ ఎండి గౌతమ్‌లు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అంతేగాక, డైరెక్టర్ ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఇందిరా నగర్, బన్నీలాల్‌పేట్, జీవీఎం కాలనీల్లో నిర్మించిన 2బిహెచ్‌కే గృహ సముదాయాలను కూడా సందర్శించారు.

## అనుమతులు లేని ఇంటిని సీజ్ చేసిన అధికారులు




**అత్తాపూర్ జూలై10,ప్రభాతవార్త :** జిహెచ్‌ఎంసి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ హెచ్చరించారు.గురువారం అత్తాపూర్‌లోని ఓ ఇంటిని హైకోర్టు ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ ,టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి విశాల్ రెడ్డిలు సీజ్ చేశారు.డిప్యూటీ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ... హైకోర్టు ఉత్తర్వులు డబ్ల్యూపి నంబర్ 35623 ప్రకారం అత్తాపూర్ డివిజన్ పరిధిలో ఉన్న ఇంటి నెంబర్ 41114 ఇల్లును టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీధర్ ఆధ్వర్యంలో సీజ్ చేయడం జరిగిందని ఇంటి నిర్మాణం కోసం ఎలాంటి అనుమతులు లేకపోవడంతో గతంలో మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసినా స్పందించలేదు. దీంతో హైకోర్టు ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టే ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకోవాలని సూచించారు. లేదంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## బెట్టింగ్ యాప్ మోసంతో గృహిణి ఆత్మహత్య

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 10, ప్రభాతవార్త** బెట్టింగ్ యాప్‌లో జరిగిన మోసంతో అప్పుల పాలై ఓ గృహిణి మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. కెపిహెచ్‌బి సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వెస్ట్ గోదావరి పాలకొల్లుకు చెందిన బోడపాటి జంగయ్య కూతురు గంగా అనూషా (27)కు గత 5 సంవత్సరాల క్రితం వరుసకు మేనబావ అయిన కోయే వెంకన్న బాబుతో వివాహం జరిగింది. అనూషా, వెంకన్న బాబులకు 4 సంవత్సరాల బాబు ఉన్నాడు. వెంకన్న బాబు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తుండగా అనూషా ఇంట్లో ఉంటూ వర్క్ ఫ్రమ్ హోం జాబ్ చేసుకుంటుంది. ఇదిలా ఉండగా ఇంట్లో నుంచి వర్క్ ఫ్రమ్ హోం చేసుకుంటున్న అనూషా బెట్టింగ్ యాప్‌కు అలవాటు పడి ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లో లక్షల రూపాయలు పొగొట్టుకుంది. ఈ క్రమంలో తెలిసిన వారి నుంచి లక్షల రూపాయలు డబ్బులు అప్పుగా తీసుకుంది. అప్పులు ఎక్కువ అవడంతో మనస్థాపం చెందిన అనూషా సూసైడ్ నోట్ రాసి ఇంట్లోని ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త తలుపు తట్టగా నాలుగు ఏండ్ల కొడుకు తలుపు తీశాడు. ఆ సమయంలో అనూషా ఇంట్లో ఫ్యాన్ హుక్కుకు వేలాడుతూ కనిపించింది. దీంతో అనూషా భర్త వెంకన్న బాబు పోలీసులకు సమాచారం అందించాడు. అనూషా ఆత్మహత్యకు బెట్టింగ్ యాప్‌లో లక్షల రూపాయలు పొగొట్టుకున్నానని, ఇది కుటుంబానికి తెలిస్తే పరువు పోంతుందని, తనను క్షమించాలని సూసైడ్ నోట్‌లో రాసింది. అనూషా తండ్రి జోగయ్య తన కూతురు మరణానికి ఎవరూ కారణం కాదని, ఎవరిపై అనుమానం లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా మోసపోవద్దని సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అనుమానస్పద మేసేజ్‌లు, లింకులు ఓపెన్ చేయకూడదని, మోసాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు.

## కల్లులో ఆల్ప్రాజోలం...పలు దుకాణాల లైసెన్స్ రద్దు

**హైదరాబాద్, జూలై 10 ప్రభాతవార్త :** నగరంలోని కూకట్‌పల్లి పరిధిలో జరిగిన కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఐదు బృందాలుగా ఏర్పడి వివిధ కల్లు దుకాణాల నుంచి నమూనాలను సేకరించారు. హైదర్‌నగర్, హెచ్‌ఎంటీకాలనీ, సర్ధార్ పటేల్‌నగర్, భాగ్యనగర్ ప్రాంతాల్లో కల్లు కంపౌండ్ల నుంచి శాంపిల్స్ సేకరించారు. నారాయణగూడలోని ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో భాగ్యనగర్ మినహా మిగతా మూడు దుకాణాల్లో మత్తు మందుల కలయికతో కల్లు తయారీ జరిగినట్లు తేలింది. నివేదిక ఆధారంగా నలుగురు కల్లు వ్యాపారులు రవితేజ గౌడ్ (29), కోన సాయితేజ గౌడ్ (31), చెట్టుకింది నాగేష్‌గౌడ్ (51), బట్టి శ్రీనివాస్‌గౌడ్ (39)లను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హైదర్‌నగర్, హెచ్‌ఎంటీహిల్స్, షంషీగూడ, సర్ధార్ పటేల్‌నగర్ కల్లు దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేశారు. కాగా, కల్తీ కల్లు తాగి 7 మంది మృతి చెందగా..మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కొన్ని దుకాణాల్లో ఆల్ప్రాజోలం మత్తు మందును కలిపి కల్లు కల్తీ చేసినట్లు గుర్తించారు.ఈ నేపథ్యంలో పలు దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేసినట్లు బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

హైదరాబాద్ వార్త



# ఆకతాయిలపై 'షీ'నజర్!

**- యువతులు, మహిళలపై వంకరగా చూస్తే జైలే - బస్టాప్, రైల్వేస్టేషన్‌లు,షాపింగ్‌మాల్స్ తదితర చోట్ల ప్రత్యేక నిఘా**

**హైదరాబాద్,జూలై 10,ప్రభాతవార్త:** అమ్మాయిలు, మహిళలు కనిపిస్తే అసభ్యంగా ప్రవర్తించడం, ద్వందార్థాలతో పైశాచికానందాలు పొందే పోకిరీలపై షీటీమ్ పంజా విసురుతోంది. ఏకధాటిగా యువతుల వైపు కన్ను ఆర్పకుండా చూసిన ఈవ్‌టీజింగ్‌యే. చూపుతో ఇబ్బందిపెట్టడం అన్నట్లు...ఇక ఏమాత్రం డౌట్‌లు వచ్చిన నీడలా పక్కనే ఉండే షీటిమ్ సైలెంట్‌గా తమ పనిని కానిస్తుంది. ఫోన్‌లు,వాట్సాప్‌లతో ఇబ్బందులకు గురి చేసిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. ఇప్పటికే వందాలాది మంది పోకిరీలను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్, కేసులు నమోదు చేశారు. సీసీ కెమెరా మాదిరిగా పోకిరిలపైనే షీటీమ్ ఫోకస్. ఏమాత్రం అనుమానాలు న్న స్టేషన్‌కు రావాల్సిందే.. ఇక ఎవరైన అమ్మాయిల వెంటపడినట్లు ఫిర్యాదులు అందినా ఆకతాయిల ఆటకట్టిస్తున్నారు. గత ఆరునెలలో సుమారు 6200 కేసులు నమోదు చేయగా. వేలమందికి కౌన్సిలింగ్ చేశారు. కొందరు మారగా..మరికొందరు అదే చర్యలతో అదేస్థాయిలో షీటీమ్ పోలీసులు సైతం స్పందిస్తున్నారు.




**బస్టాప్, రైల్వేస్టేషన్, కళాశాలల్లో ప్రత్యేక నిఘా..**

హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో షీటీం నిఘా మరింత వేగవంతం చేసింది. ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళ ఉద్యోగులు, విద్యార్థినులు, యువతులపై పోకీరీల వికృత చేష్టలను పసిగట్టి చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా లక్డికాపూల్, సికింద్రాబాద్, ఎల్‌బి నగర్, ఉప్పల్, రాజేంద్రనగర్, చిక్కడపల్లితో పాటు ఆయా ప్రాంతాల్లో కళాశాలలు, గర్ల్స్ హాస్టల్స్, రెస్టారెంట్లు, బస్టాప్‌లు, రైల్వేస్టేషన్లు, మెట్రో స్టేషన్ల వద్ద షీటిమ్స్ ఇదందరు, నల్గురు, ఆరుగురు చొప్పున నిఘా ఏర్పాటు చేశారు. ఏమాత్రం అమ్మాయిలు ఇబ్బందులకు గురయిన పోకిరీలను అదుపులోకి తీసుకుంటున్నారు. ఇటీవల రాచకొండ పరిధిలో సుమారు మూడొందల మందికి పైగా అదుపు లోకి తీసుకుని తలిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ చేశారు. వీరి కలాపాలపై వివరించారు. రెండోసారి పునారవృత్తమైతే కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించి పంపిస్తున్నారు. ఇక మరింత దారుణంగా వ్యవహరించిన వారిపై ఉక్కుపాదం మోపుతూ కేసులు నమోదు చేస్తు న్నారు. ఇటీవల సోషల్‌మీడియా, ఫోన్‌లు, డైరెక్ట్ గా వేధించిన వారిపై వందకు పైగా ఉన్నాయి. ఎక్కువ శాతం సోషల్‌మీడియాలోనే అసభ్యకరమైన సందేశాలతో వేధిస్తున్నట్లు షీటీమ్ పోలీసులు పేర్కొంటున్నారు. అవసరమైతే డెకాయ్ ఆపరేషన్లు చేపడుతామని వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా హాస్టళ్లలో ఉండే గ్రామీణ యువతులపైనే ఆకతాయిలు ఫోకస్ చేస్తున్నారు. మాటలు కలుపుతూ ఫోన్ నెంబర్లు పరస్పరం ఇచ్చిపుచ్చుకుని అసలు రంగు బయటపెడుతున్నారు. వేధింపులకు గురిచేయడంతో పాటు బ్లాక్‌మెయిల్స్‌కు పాల్పడుతున్నారు. గత రెండు నెలల క్రితం అమీర్‌పేటలోని బస్టాప్‌లో ఓ హాస్టల్ యువతిని నిరంతరం చూడడంతో పాటు ఫాలో కాగా.. షీటిమ్ నెంబరుకు ఫోన్ చేయడంతో నిఘా ఉంచి పట్టుకున్నారు. అదేవిధంగా సికింద్రాబాద్‌లోని ఓ యువతి పరిచయం లేకపోయిన నల్గురు పోకిరీలు పనిగట్టుకుని ఫోన్‌తో ఫోటోలు తీయడంతో అభ్యంతర వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. సదరు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.




**ఫిర్యాదు గోప్యం..**

**చర్యలతో భద్రత...**

ఆకతాయిలు వేదింపులకు పాల్పడితే ఎమాత్రం సంకోచించకుండా షీటీమ్‌కు ఫిర్యాదు చేయడంతో గోప్యంతో పాటు సరైన భద్రత లభిస్తుందని షీటీమ్ పోలీసులు సూచిస్తున్నారు. తలిదండ్రులు సైతం పిల్లలను గమనిస్తూ ఉండాలని, వారి కలాపాలను పర్యవేక్షించాలని చెబుతున్నారు. వాట్సాప్, సోషల్‌మీడియా, ఇలా పోకిరీలతో ఇబ్బందులు ఎదురైన చాలావరకు యువతులు చెప్పడానికి భయపడతారు. వారిని దగ్గర తీసుకొని మంచితనంగా తెలుసుకుని ఫిర్యాదు చేయించడంతో పోకిరీల నుంచి బయటపడే ఆస్కారం ఉంటుందని భరోసా కల్పిస్తున్నారు. లేదంటే కుమిలిపోయి భయంభయంగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఉంటుందని చెబుతున్నారు.

# కమిషనర్ అధికారాలు బదలాయింపు

- -అడిషనల్ కమిషనర్లకు పరిపాలన, ఆర్థికపరమైన పవర్స్
- -టౌన్ ప్లానింగ్‌లోనూ జెడ్‌సి, డిసిలకు బాధ్యతలు
- -బుద్ధభవన్‌లో హైడ్రా కార్యాలయానికి మూడేళ్లు లీజ్
- -జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీలో 14అంశాలకు 2టేబుల్ ఐటెంలకు ఆమోదం



స్టాండింగ్ కమిటీ మీటింగ్‌లో మాట్లాడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**హైదరాబాద్, జూలై 10,ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ 14అంశాలు, 2టేబుల్ ఐటెంలకు ఆమోదం తెలిపింది. ఈమేరకు గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో జీహెచ్‌ఎంసీలో పరిపాలనా పరమైన అంశాల్లో మార్పులు చేస్తున్నట్లు కమిషనర్ ఆర్వీకర్ణన్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు.ఉద్యోగులకు సంబంధించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛన్ వంటి అంశాల్లో కమిషనర్‌కు ఉన్న అధికారాలను అడిషనల్ కమిషనర్(అడ్మిన్), అడిషనల్ కమిషనర్ (ఫైనాన్స్)కు బదలాయించారు. అలాగే టౌన్ ప్లానింగ్ విభాగంలోనూ తక్షణ రిజిస్టేషన్, అప్రూవల్ విషయంలో నిర్ణీత సమయంలో సరైన డాక్యుమెంట్లు సమర్పించకపోతే ఆపర్మిషనన్ను రద్దు చేసే అధికారం కమిషనరు మాత్రమే ఉండగా దీన్ని జోనల్, డిప్యూటీ కమిషనర్లకు కట్టబెట్టారు. అలాగే హైడ్రాకు బుద్ధభవన ను లీజుకు ఇవ్వనున్నారు. గతంలో ఈవీడీఎం జీహెచ్‌ఎంసీకి చెందినది కావడంతో ఎలాంటి అద్దె వసూలు చేయలేదు. అయితే హైడ్రా స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేసిన తరుణంలో బుద్ధ భవన్‌కు సంబంధించిన అద్దెను జీహెచ్‌ఎంసీకి హైడ్రా చెల్లించాల్సి ఉంటుంది

**కమిటీ ఆమోదం తెలిపిన ఇతర అంశాలు...**

సరూర్‌నగర్ పెద్దట్యాంక్‌బండ్ మరమ్మత్తుల కోసం 5.60కోట్ల అంచనా వ్యయంతో టెండర్ పిలవడానికి కమిటీ ఆమోదం. అలాగే శాస్త్రీ పురం ఆర్వోబి నుంచి ఇన్నర్‌రింగ్‌రోడ్ వరకు 100ఫీట్స్ రోడ్ వెడల్పు చేయడానికి ఆమోదం. వనస్థలి పురం నుంచి వయా సాహెబ్‌నగర్ మీదుగా ఓల్డ్ హయత్‌నగర్ వరకు 18మీటర్లు నుంచి 24ఫీట్ల రోడ్డు వెడల్పు చేసేందుకు మిస్సింగ్ లింక్ రోడ్డు నిర్మాణానికి 102 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం ఇలా మొత్తం 14అంశాలు 2టెబుల్ అంశాలకు మోదం తెలిపారు. ఈ సమావేశంలో జీహెచ్ ఎంసీ కమీషనర్ ఆర్.వి కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, డా.ఆయేషా హుమేరా, మహమ్మద్ సలీం, బాతజబీన్, మహాలక్ష్మి రమన్ గౌడ్, సి.ఎన్.రెడ్డి, మహమ్మద్ బాబా ఫసియుద్దీన్, వి.జగదీశ్వర్ గౌడ్, బూరుగడ్డ పుష్ప పాల్గొనగా అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, సత్యనారాయణ వేణుగోపాల్, సుభద్ర, పంకజ, గీతా రాధిక, మంగతాయారు, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్‌రావు, అపూర్వ్ చౌహాన్, రవి కిరణ్, వెంకన్న, సిసిపి శ్రీనివాస్, సిఈలు కోటేశ్వర రావు, సహదేవ్ రత్నాకర్, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్, సహాయ ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్జయినీ మహాకాళీ ఆలయం వద్ద ఊపందుకున్న బ్యారికేడింగ్ పనులు

**-అమ్మ వారి ఆలయం వైపు రాకపోకల నిలిపివేసిన ట్రాఫిక్ సిబ్బంది**

**-ఇబ్బందులకు గురైన వాహనదారులు**

**బేగంపేట జులై 10,ప్రభాతవార్త :** లష్కర్‌లో ఆషాడ బోనాల జాతరకు మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉండటంతో సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయం వద్ద పనులు ఊపందుకున్నాయి. ముఖ్యంగా పలు గల్లీల నుంచి ఆలయానికి వచ్చే మార్గాలతో పాటు రాంగోపాల్‌పేట పాత పోలీసుస్టేషన్ వైపు నుంచి అమ్మ వారి ఆలయానికి వచ్చే మార్గంలో ఒక వైపు బ్యారికేడింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.ఇప్పటికే అమ్మ వారి ఆలయం వద్ద విద్యుత్ లైట్లతో అమ్మ వారి ఫోటోలను ఏర్పాటు చేసారు.గురువారం గురుపౌర్ణమి కావడంతో అమ్మ వారి దర్శనానికి జంట నగరాల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను సాయంత్రం సమయంలో రాంగోపాల్‌పేట పాత పోలీసుస్టేషన్ వైపు కమాన్ వద్ద ఉన్న ట్రాఫిక్ సిబ్బంది వాహనాలను నిలిపి వేయడంతో ఒక్క సారిగా ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జాం అయింది.దీంతో ఈ మార్గంలో ప్యారడైజ్ సిగ్నల్ నుంచి రాణిగంజ్ వైపు వెళ్లే వాహనాలు మెల్లగా ఆగుతూ సాగాయి.ఇక కమాన్ వద్ద ఉన్న ట్రాఫిక్ సిబ్బంది మహంకాళీ ఆలయానికి వచ్చే వాహనదారులను ఒక్క సారిగా దారి మళ్లించడంతో వాహనదారులు చుట్టు తిరుగుడు ప్రయాణం చేయాల్సి వచ్చింది.దీంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.ఇదే సమయంలో ట్రాఫిక్ సిబ్బంది పలు వాహనాలను అడ్డుకోవడంతో ప్రధాన రోడ్డుపైన వెళుతున్న ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.ఒక వైపు బారికేడింగ్ పనులతో పాటు ట్రాఫిక్ ను నిలిపివేయడంతో ఆలయానికి వెళ్లే భక్తులు సైతం కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఆషాడ బోనాల జాతర ప్రారంభం కాకముందే పరిస్థితి ఇలా ఉంటే జాతర సమయంలో మరెలా ఉంటుందో అంటూ పలువురు భక్తులు ఆందోళణ వ్యక్తం చేసారు.


మహంకాళీ పోలీసుస్టేషన్ పక్కన గల్లీలో బ్యారికేడింగ్ చేస్తున్న దృశ్యం

## కాంగ్రెస్ పార్టీ నగర ఇన్‌చార్జి జగ్గారెడ్డిని కలసిన డాక్టర్ రవిశేఖర్ రెడ్డి



కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా నూతన ఇంచార్జ్ జగ్గారెడిని కలసిన గ్రేటర్ హైదరాబాద్ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిశేఖర్ రెడ్డి తదితరులు

**హైదరాబాద్, జూలై 10 ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా నూతన ఇంచార్జ్‌గా నియమితులైన జగ్గారెడ్డిని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి, గ్రేటర్ హైదరాబాద్ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిశేఖర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భముగా జగ్గారెడ్డి, డాక్టర్ రవిశేఖర్ రెడ్డికి పలు సూచనలు చేశారు. పార్టీ అభివృద్ధి కి కృషి చెయ్యాలన్నారు.డాక్టర్ రవి శేఖర్ రెడ్డి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను, సేవా కార్యక్రమాలను సామాజిక మాధ్యమాలలో, సోషల్ మీడియా, పత్రికల్లో చూస్తున్నానని ఆయనను అభినందిం చారు. ఇలాగే కార్యక్రమాలను కొనసాగిస్తూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లి వారికి వివరించి,ఆ సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరుకునే విధంగా కృషి చెయ్యాలన్నారు. జుబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ విజయానికి అందరూ కలసి కట్టుగా కృషి చేయాలన్నారు.

## పట్టుదల, క్రమశిక్షణ ఉన్నత శిఖరాలను చేరుస్తుంది

### -పద్మశ్రీ డాక్టర్ హనుమాన్‌చౌదరి



అవంతి డీగ్రీ పిజీ కళాశాలల ఆధ్వర్యంలో ప్రవిష్ట-2025 సదస్సును ప్రారంభిస్తున్న పద్మశ్రీ డాక్టర్ హనుమాన్ చౌదరి, చిత్రంలో మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు తదితరులు

**హైదరాబాద్, జూలై 10 ప్రభాతవార్త**

ప్రతి విద్యార్థి తమ భవిష్యత్ పై కలలు కనాలని ఆ దిశగా కష్టపడి చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని దానికి చక్కటి నిదర్శనం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని పద్మశ్రీ డాక్టర్ టి. హనుమాన్ చౌదరి అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డీగ్రీ పిజీ కళాశాలల ఆధ్వర్యంలో ప్రవిష్ట 2025 పేరిట అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ డాక్టర్ టి. హనుమాన్ చౌదరి మాట్లాడుతూ క్రమశిక్షణ గల విద్య ఉన్నత శిఖరాలను చేరుస్తుందని చెప్పారు. ప్రతి విద్యార్థి విలువలను పెంపొందించుకోవాలని దేశం పట్ల గురువులు తల్లిదండ్రుల పట్ల ప్రేమ గౌరవంతో మలుచుకోవాలన్నారు. మన దేశ సంస్కృతి ప్రపంచానికే తలమానికం అని విదేశీ సంస్కృతితో పెడదారిన పడవద్దని ఆయన సూచించారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో తట్టుకోవాలంటే ప్రతి విద్యార్థి అంకిత భావంతో చదవాలన్నారు. తల్లి దండ్రుల సైతం పిల్లలకు తోడుగా ఉండి వారిలో క్రమశిక్షణను నేర్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్ ,ప్రముఖ విద్యావేత్తలు సుమియా అజీజ్, శోభా సిస్టర్, అవంతి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియంక, అధ్యక్షులు ఎం. జ్ఞానేశ్వరి, డైరెక్టర్ శ్రావణ్ కుమార్, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద, వైస్ ప్రెసిడెంట్ ఎంవిఎస్ఎస్ నందిష్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్ అప్పారావు, డాక్టర్ రాకేష్ మనుక తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు రుతు ఆరోగ్యం విషయంలో అవగాహన అవసరం

### -మహిళా భద్రత విభాగం డిసిపి డాక్టర్ లావణ్య



వెదురు ఆధారిత పరిశుభ్రత కిట్‌ల పంపిణీ చేస్తున్న మహిళా భద్రత విభాగం డీసీపీ డాక్టర్ లావణ్య

**చిక్కడపల్లి, జూలై 10 ప్రభాతవార్త:** మహిళలు రుతు ఆరోగ్యం విషయంలో అవగాహన కలించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని మహిళా భద్రత విభాగం డీసీపీ డాక్టర్ లావణ్య అన్నారు. మరికొన్ని ప్రాంతాలలో చేపట్టబోతున్నట్లు వివరించారు. రుతుక్రమ హక్కు అంశంపై గురువారం పట్టణ నివాసితుల సంక్షేమ సంఘాల సహకారంతో వెదురు ఆధారిత పరిశుభ్రత కిట్‌ల పంపిణీ కార్యక్రమం సుహార్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు హితేష్ దత్తా ఆధ్వర్యంలో జరిగింది. యుక్తవయస్సులో ఉన్న వారికి ఇటువంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించి చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కె.శిల్పిరెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాదధికారి ఆర్ఎస్‌వి బద్రీనాత్ పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు. ఋతు ఆరోగ్య అవగాహనను మార్చేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకుని స్థిరమైన ఋతు పరిశుభ్రత,మహిళా సాధికారతపై దృష్టి సారించడంతో పాటు మార్పు సృష్టికర్తలు ఆలోచనా నాయకుల నుండి శక్తివంతమైన స్పందన లభించిందన్నారు. ఋతుస్రావ కళంకాన్ని అంతం చేయడం, పర్యావరణ అనుకూల పారిశుధ్య ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం, సమాజం ఆధారిత మద్దతు నమూనాల కోసం వాదించడం తదితర అంశాలపై సదస్సు కొనసాగింది. ప్రతి స్త్రీకి గౌరవంగా ఋతుస్రావం చేసుకునే హక్కు ఉందని, బయోడిగ్రేడబుల్ శానిటరీ కిట్‌లను స్పాన్సర్ చేయడం ద్వారా పేద బాలికలకు మద్దతు ఇవ్వాలని సమావేశం కోరింది.

## ఉజ్జయినీ మహంకాళీ అమ్మ వారికి బంగారు బోనం సమర్పణ



**యాకుత్‌పుర,జూలై 10 ప్రభాతవార్త :** ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా పాతనగర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు చైర్మన్ జి.రాఘవేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్ ఉజ్జయిని శ్రీ మహంకాళీ దేవాలయం అమ్మ వారికి బంగారు బోనం సమర్పించారు.హరిబౌలిలోని అక్కన్నమాదన్న శ్రీ మహంకాళీ మందిరంలో అమ్మ వారికి పూజలు నిర్వహించిన అనంతరం సాంప్రదాయంగా ముస్తాబు చేసిన బంగారు బోనాన్ని జోగిని నిషా క్రాంతి తలపై పెట్టుకుని వాయిద్యాల నడుమ సికింద్రాబాద్ ఉజ్జయిని శ్రీ మహంకాళీ దేవాలయానికి వెళ్లి శ్రీ ఉజ్జయిని మహంకాళీ అమ్మ వారికి బంగారు బోనాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాతనగర ఉమ్మడి దేవాలయాల ఊరేగిం పు కమిటి చైర్మన్ రాఘువేందర్, అక్కన్న మాదన్న శ్రీ మహంకాళీ దేవాలయం కమిటి ప్రతి నిధులు ప్రభాకర్,సతీష్ కుమార్, దత్తాత్రేయలు,రామ్‌దేవ్ అగర్వాల్ పాల్గొన్నారు.



సాయిబాబాను దర్శించుకున్న శంభీపూర్ క్రిష్ణ



శ్రీ సాయిబాబాకు అభిషేకం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కొలన్ శ్రీనివాస్ రెడ్డి



శ్రీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న హన్మంత్ రెడ్డి



మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు



శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్



వివేకానంద్‌నగర్ కాలనీలోని శ్రీ శిరిడీసాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి సందర్భంగా పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు.



గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు



అడిక్‌మెట్ సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పాశం సాయికృష్ణయాదవ్ తదితరులు



శ్రీ సాయిబాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం



భరత్ నగర్ కాలనీలోని శ్రీ సాయి అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ముమ్మారెడ్డి ప్రేమ కుమార్



1వ వార్డు జయనగర్ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ జంపనప్రతాప్ తదితరులు



స్నేహపురి కాలనీలోని సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి పూజల్లో పాల్గొన్న ఆలయ వ్యవస్థాపన చైర్మన్ ప్రొఫెసర్ ఎస్ఎమ్ ఫిరాన్.



గురుపౌర్ణమి సందర్భంగా విఠలేశ్వర ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



గురుపౌర్ణమి సందర్భంగా పూజలల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జగదీశ్వర్‌గౌడ్ తదితరులు



గురు పౌర్ణమిభారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సందర్భంగా గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు

# నగరంలో భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

## రాజకీయాలకు అతీతంగా బోనాల పండుగను జరుపుకుందాం

**-రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్**
**-ముషీరాబాద్ నియోజకవర్గంలోని 201 దేవాలయాలకు బోనాల చెక్కులు పంపిణీ**



చెక్కులు పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్

**ముషీరాబాద్, జూలై 10, ప్రభాతవార్త:** బోనాల పండుగను రాజకీయాలకు అతీతంగా ఘనంగా జరుపుకుందామని రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం భోలక్‌పూర్‌లోని దేవుని తోట దేవాలయంలో బోనాల చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉదయం పదిగంటలకు నిర్వహించాల్సిన కార్యక్రమంకు ఎవరూ రాకపోవటంతో కార్యక్రమం ఆలస్యమవుతుందని తెలుసుకున్న అనిల్ కుమార్ యాదవ్ గాంధీభవన్‌లో సమావేశంకు వెళ్లి వస్తానని స్థానిక నాయకులకు చెప్పి వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ చెక్కుల పంపిణీ కార్యక్రమం కోసం వచ్చి, ఎంపీ రాక కోసం చాలా సమయం ఎదురుచూశారు. ఎంపీ రాకపోవటంతో బీఆర్ఎస్ కార్యకర్తలు కొన్ని చెక్కులు ఎమ్మెల్యేతో ఇప్పించాల్సిందిగా అధికారులను కోరారు. ఎంపీ వచ్చే వరకు చెక్కులు ఇవ్వటం కుదరదని అధికారులు తెలపటంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అరగంటలో వస్తానని చెప్పిన ఎంపీ గంట గడిచిపోయినా రాకపోవటం, అధికారులు చెక్కులు పంపిణీ చేయనివ్వకపోవటంతో ఆగ్రహించిన ముఠాగోపాల్ వెనుదిరిగి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆలయం నుండి వెళ్లిపోయారు. అనంతరం దేవాలయానికి వచ్చిన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, తాను కావాలని ఆలస్యం చేయలేదని, గాంధీ భవన్‌లో ముఖ్యసమావేశంకు హాజరవ్వటం వల్ల ఆలస్యమయిందని వివరణ ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని పండుగలను ఘనంగా జరుపుకునే విధంగా ఏర్పాట్లుచేస్తున్నారని తెలిపారు. మన తెలంగాణలో ఎక్కువ దేవాలయాలు ఉన్న ప్రాంతం, ఘనంగా బోనాలు జరుపుకునే ప్రాంతం ముషీరాబాద్ అని గుర్తు చేశారు. ముషీరాబాద్‌లో మొత్తం 201 దేవాలయాలకు, సుమారు కోటీ ఏడు లక్షల అరవైవేల రూపాయలు తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ, ముషీరాబాద్ బీజేపీ నాయకులు పూసరాజు, వెంకటేష్, స్థానిక కాంగ్రెస్ నేతలు, దేవాలయ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం



ప్రసంగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ.దామోదర్ రెడ్డి తదితరులు

**చిక్కడపల్లి, జూలై 10 ప్రభాతవార్త:** పెన్షనర్లకు రావలసిన బకాయి సొమ్మును ప్రతినెలా రూ. 700 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ విషయాన్ని పూర్తిగా విస్మరిస్తోందని, ఈ బకాయిలను వెంటనే చెల్లించాలని లేని పక్షంలో ప్రభుత్వ పెన్షనర్ల పక్షాన ఆందోళన కార్యక్రమాలు తప్పవని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ.దామోదర్ రెడ్డి , రాష్ట్ర సెక్రటరీ జనరల్ సీ.చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సుమారు 2 లక్షల 80 వేల మంది విశ్రాంత ఉద్యోగులు 1 శాతం చందాతో కూడిన నగదు రహిత వైద్య సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని, పలు దఫాలుగా మంత్రులు ప్రకటనలు చేశారని, అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులు, పెన్షనర్ల పక్షాన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా హామీ ఇచ్చినందుకు ధన్యవాదాలు కూడా తెలియజేశామన్నారు. పెన్షనర్లు తమ వైద్యానికి అయ్యే ఖర్చులు భరించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, కొంత మంది సకాలంలో చికిత్స అందక మరణిస్తున్న దాఖలాలు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉద్యోగులకు సర్కార్ ఇటీవల డీఏ ప్రకటించిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు శాతం డీఏ పెంపుదల చేస్తు నిర్ణయం తీసుకుందని ,పెంచిన డీఏ వచ్చే జనవరి నుంచి అమల్లోకి వస్తుందని అప్పటి వరకు పెన్షనర్లకు ఆర్థిక సమస్యలు తప్పే పరిస్థితులు లేనట్లు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పెంటయ్య, రాష్ట్ర బాధ్యులు శ్యాంరావు, గంగ రెడ్డి, శంకర్‌రెడ్డి , ప్రహ్లాదరావు , ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, సిరిసిల్ల, నిర్మల్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డిని సత్కరించి అభినందించారు.

## పాపం పసికందు..

**హైదరాబాద్ జూలై10,ప్రభాతవార్త :**

ఏతల్లి కన్నదో ఏమో ఆ బిడ్డను.. నవ మాసాలు మోసి కనిపెంచిన బిడ్డను బాత్‌రూమ్‌లోని మ్యాన్ హోల్‌లో పడేసి వెళ్లిపోయింది. బిడ్డపై కాస్తంతైనా జాలిలేని ఆ తల్లి ఎంతటి కఠినరాలో అంటూ నిమ్స్‌లోని పలువురు తల్లులు తలవంచుకుంటున్నారు. గురువారం మధ్యాహ్నం 1.30 ప్రాంతంలో వెలుగు చూసిన సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నిమ్స్ ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ సమీపంలోని పాత ఓపీ రూమ్ నంబరు 19 వద్ద మహిళల కోసం బాత్రూమ్ ఏర్పాటు చేశారు. అయితే బాత్రూమ్‌లో వాటర్ జామ్ అయ్యింది. దానిని సరిచేయాలని నిమ్స్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు యాజమాన్యం చెప్పింది. సిబ్బంది మ్యాన్ హోల్ తెరిచి చూడగా కాలు కనిపించింది. బయటకు తీసి చూడగా సుమారు 5 నెలల బాబు డెడ్ బాడీగా కనుగొన్నారు. దాంతో పంజాగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే నిమ్స్‌లోని స్త్రీల వాష్ రూమ్‌లోకి ఆ బిడ్డను ఎవరు తీసుకువచ్చి పడేశారన్న విషయంపై పోలీసులు సీసీ ఫుటేజి ద్వారా ఆరా తీస్తున్నారు. బిడ్డ డెడ్ బాడీని మార్చురీలో భద్ర పరిచారు.

## బ్రహ్మకుమారీ కార్యాలయంలో గురుపౌర్ణమి వేడుకలు



గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న బ్రహ్మకుమారీలు

**సైఫాబాద్, జూలై 10 ప్రభాతవార్త:** హిమాయత్ నగర్‌లోని బ్రహ్మకుమారీ శాఖలో గురువారం గురుపౌర్ణమి పర్వదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బ్రహ్మకుమారీలు, బ్రదర్స్ అత్యంత భక్తిశ్రద్ధలతో దీప ప్రజ్వలన చేసి నైవేద్యాన్ని పరమాత్మకు సమర్పించారు. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్ శాఖ ఇన్‌చార్జ్ బికె అంజలి మాట్లాడుతూ ఈ ఏడాది గురుపౌర్ణమి గురువారం రోజున రావడం గొప్ప విశేషమన్నారు. భారతదేశంలో గురుపౌర్ణమి రోజున గురువులకు మాత్రమే కాకుండా అన్ని రకాల కళలను నేర్పించే గురువులకు కృతజ్ఞత తెలిపే దినంగా పరిగణించబడుతుందన్నారు. గురు అంటే అంధకారం నుంచి వెలుగులోకి తీసుకు వెళ్ళేవారని ఈ కలియుగ చివరి కాలంలో సత్యమైన సద్గురువు శివ పరమాత్మ అవతరించి జ్ఞానప జ్యోతిని ప్రసాదించి మానవాత్మలను అజ్ఞాన అంధకారం నుంచి జ్ఞాన ప్రకాశం వైపు తీసుకువెళతారని చెప్పారు. ఈశ్వరీయజ్ఞాన యోగాన్ని బోధించి, మానవులలోని ఐదు వికారాలను తొలగించేందుకు శక్తిని ఇస్తున్నారని ఆమె వివరించారు. ఈ జ్ఞాన యోగ శిక్షణ ద్వారా మనలోని వికారాలపై విజయం సాధించి, సద్గుణాలను అలవర్చుకోవచ్చునని చెప్పారు. మానవాత్మలు అందరిలో ఈ విధంగా సద్గుణాలను నిండితే ఈ ప్రపంచం తిరిగి సత్యయుగంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు సుజాత, అశ్విని, ప్రత్యూష, అరుణ్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

## నేడు లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళీ దేవాలయం బోనాల ఉత్సవాలు ప్రారంభం



**చార్మినార్,జూలై 10 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రాంతంలోనే అత్యంత వైభవంగా,ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుపుకునే పాతబస్తీ లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళీ దేవాలయం ఆషాడ మాస బోనాల జాతర ఉత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని మందిరం కమిటి చైర్మన్ బి.మారుతి యాదవ్ తెలిపారు.బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా లాల్‌దర్వాజ సింహవాహినీ మందిరాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.117వ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించటానికిగాను దేవాలయం కమిటి అన్ని ఏర్పాట్లు చేసింది. జూలై నెల 11 నుంచి ప్రారంభమయ్యే బోనాల జాతర ఉత్సవాలలో తొలి రోజైన శుక్రవారం మందిరంలో శ్రీ గణపతి హోమం,సప్తశతి పారాయణం,ఉదయం 8.30 గంటలకు దేవి అభిషేకం జరుగుతుందని ఆయన తెలిపారు.శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జరగనున్న శిఖర పూజ,ధ్వజారోహనణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌సి.వి.ఆనంద్,జి.హెచ్.ఎం.సి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌లు విచ్చేసి అమ్మ వారికి శిఖర పూజ, ధ్వజారోహణ గావించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారని లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళీ దేవాలయం కమిటి చైర్మన్ మారుతి యాదవ్ తెలియజేశారు.

## విద్యనిచ్చిన గురువు భగవంతునితో సమానం

### -బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు



గురువులను సన్మానిస్తున్న రాంచందర్‌రావు తదితరులు

**సికింద్రాబాద్, జూలై 10 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు గుండగోని భరత్ గౌడ్ ర్యంలో గురుపూజోత్సవం కార్యక్రమం పద్మారావు నగర్ సెవెన్ హిల్స్ కన్వెన్షన్‌లో జరిగింది.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు వి.రాంచందర్ రావు పాల్గొని ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సెలర్ తిరుపతి రావు, భరత్ భూషణ్ శంకరయ్య, డాక్టర్ సౌమ్య, వీరబాబులో పాటు వివిధ యూనివర్సిటి ప్రొఫెసర్స్‌ను, ప్రిన్సిపాల్స్‌ను, టీచర్స్‌ను సన్మానించారు.. ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాంచందర్ రావు మాట్లాడుతూ మన జీవితంలో గురువుల పాత్ర చాలా గొప్పదని. వారు మనకు విద్యను నేర్పించడమే కాకుండా, మనల్ని మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దుతారని అన్నారు. వారు మనకు నైతిక విలువలను, సామాజిక బాధ్యతలను నేర్పుతారన్నారు. గురువులు మనకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి, మన లక్ష్యాలను సాధించడానికి సహాయపడతారన్నారు. తల్లి తండ్రుల తర్వాత ఆ దేవుడు గురువుకు స్థానం ఇచ్చారన్నారు. మాజీ వైస్ ఛాన్సెలర్ తిరుపతి రావు మాట్లాడుతూ ఈ రోజు ఈ స్థానంలో తానుండడానికి ఆ రోజుల్లో మా గురువులు నేర్పిన చదువు, కష్టపడే తత్వం, కృషి పట్టుదల అన్ని నేర్పించడం వల్లేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు శ్యామసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, పార్లమెంట్ కన్వినర్ రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్‌లు సరళ, కొంతం దీపిక, చీర సుచిత్ర, సుప్రియ, గురు పౌర్ణమి అభియాన్ కన్వీనర్ కన్నురి క్రాంతికుమార్, కోకన్వీనర్ నాగ భూషణం, శ్రీశైలం గౌడ్, రమేష్ రామ్, నాగేశ్వర్ రెడ్డి, విజయానంద్, సతీష్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అతితెలివి ప్రదర్శించి అడ్డంగా బుక్కయిన కంప్యూటర్ ఆపరేటర్

**గచ్చిబౌలి, జూలై 10, ప్రభాతవార్త :** కంప్యూటర్ ఆపరేటర్ అక్రమాలకు అలవాటుపడి తన అతితెలివి ప్రదర్శించి అడ్డంగా బుక్కయ్యాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి ప్రాథమిక సమాచారం మేరకు శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అభిలాష్ అనే తాత్కాలిక ఉద్యోగి అర్ధరాత్రి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే కార్యాలయంలోని లాగిన్ ఓపెన్ చేయడానికి ప్రయత్నించినట్లు బయటపడింది. అందుకు సంబంధించిన ఓటీపీ జోనల్ కమీషనర్‌కి రావడంతో వెంటనే అప్రమత్తం అయిన జెడ్సీ కిందిస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశాడు. ఉదయం ఘటనపై ఆరా తీసిన జోనల్ కమీషనర్ హేమంత్ బోర్కడే విచారణకు ఆదేశించాడు. దీనిపై విచారణ జరిపిన సీపీ శ్యామ్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ అభిలాష్ లాగిన్ ఓపెన్ చేయడానికి ప్రయత్నించినట్లు గుర్తించారు. కంప్యూటర్ ఆపరేటర్ అభిలాష్‌ను జోనల్ కమీషనర్ హేమంత్ బోర్కడే సస్పెండ్ చేశారు. గతంలో కూడా టౌన్ ప్లానింగ్ ఏసిపి, సెక్షన్ ఆఫీసర్లు లాగిన్స్ ఓపెన్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇది వరకు వివిధ సర్కిళ్లలో కూడా పని చేసిన ఆపరేటర్ అభిలాష్ గతంలో పని చేసిన ప్రాంతాల లాగిన్స్ కూడా వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం సచివాలయం ముట్టడి యత్నం

**సైఫాబాద్, జూలై 10 ప్రభాతవార్త:** విద్యారంగ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు సచివాలయం ముట్టడించడానికి ప్రయత్నించగా పోలీసులు బలవం తంగా అరెస్టు చేశారు. అరెస్టు సందర్భంగా పోలీసులు, కార్యకర్తల మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి వ్యాన్‌లలో ఎక్కించి తీసుకువెళ్ళారు. అంతకు ముంది మీడియాతో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు.

## ఫిర్జాదిగూడ గాయత్రి నగర్‌లో ఘనంగా గురుపూజోత్సవం



పీర్జాదిగూడ కార్పొరేషన్ గాయత్రీ నగర్ శ్రీ షిరిడి సాయి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ వ్యవస్థాపకరాలు సునందా భాయ్ ,చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి ,ప్రెసిడెంట్ కొల్తూరి కుమార్ ,చెరుకు మహేష్ గౌడ్ తదితరులు

**మేడిపల్లి, జూలై 10 ప్రభాతవార్త :** ఫిర్జాదిగూడ కార్పొరేషన్ గాయత్రి నగర్‌లో దక్షిణ షిరిడిగా పేరుగాంచిన షిరిడి సాయి దత్తక్షేత్రంలో గురు పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు . స్వాతిక రూప శిరిడి సాయి 16 గురుపౌర్ణ మహోత్సవంలో ఉదయం 4 గంటల నుండి రాత్రి 9:30 వరకు పంచామృత అభిషేకం , పాలాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం , సహస్ర పుష్పార్చన ,పాద స్పర్శ సేన , పాదస్వర్శ సేవ, అన్నప్రసాద సేన, భజన భక్తి గీతాలు, పల్లకి సేన , శేజ్ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకరాలు మాతాజీ పాగా సునంద బాయి ,చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి ,ప్రెసిడెంట్ కొల్తూరి కుమార్ ,మాజీ కార్పొరేటర్ మాదుగుల చంద్రకళ చంద్రారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెరుకు మహేష్ గౌడ్, సేటు రామ్,రాజన్న ,గాయత్రి కాలనీ వాసులు, పాల్గొన్నారు .

## సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



బోడుప్పల్ సాయిబాబా మందిరంలో పూజ నిర్వహిస్తున్న మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , కొత్త కిషోర్ గౌడ్ , తోటకూర చందర్ యాదవ్ , జెడిగె మహేందర్ యాదవ్ తదితరులు

**బోడుప్పల్ ,జూలై 10 ప్రభాతవార్త ;** బోడుప్పల్ నగరపాలక సంస్థ సాయిబాబా మందిరంలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ , మాజీ కార్పొరేటర్ జెడిగె మహేందర్ యాదవ్ తో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ నాయక్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొమ్మక్ బాలయ్య , కృపా సాగర్ ముదిరాజ్ , పొద్దుటూరి వెంకటేష్ గుప్తా , ఆలయ చైర్మన్ తోటకూర చందర్ యాదవ్ , తోటకూర విజయ్ యాదవ్ , చీరాల జంగయ్య , సాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## గురువులే మొదటి దైవాలు : రామ్ ప్రదీప్



గురువులను సన్మానిస్తున్న రామ్ ప్రదీప్ బృందం...

**కుషాయిగూడ, జూలై 10, ప్రభాతవార్త :** దైవాన్ని తల్లిదండ్రుల పట్ల గౌరవాన్ని నేర్పించేది గురువులే అని వారే మొదటి దైవాలని బిజెపి ఎస్ బి కాలనీ మీర్పేట్ డివిజన్ అధ్యక్షులు పలు సేవా కార్యక్రమాల సంఘ సేవకులు మునిగంటి రాంప్రదీప్ పేర్కొన్నారు.గురుపౌర్ణమి వ్యాస పౌర్ణమి నీ పురస్కరించుకొని కాప్రా సర్కిల్ పరిధిలోని ఎస్ బి కాలనీ మీర్పేట్ డివిజన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావిభారత దేశానికి ఉపయోగపడే అన్ని రకాల పౌరులను తీర్చిదిద్దే గురుతరమైన బాధ్యత కేవలం గురువులకే దక్కుతుందన్నారు. దేశానికి అవసరమైన నిష్ఠాతులైన నాయకులను అధికారులను పౌరులను అందిస్తున్న గురువులకు సర్వదా కృతజ్ఞులుగా ఉండాలన్నారు. 2001-2002 10వ తరగతి బ్యాచ్ సభ్యులు, గురుపౌర్ణమి సందర్భంగా మదర్ తెరెసా హైస్కూల్ లో మార్గదర్శకురాలైన ఉపాధ్యాయిని సుభాషిణి నీ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు. ఆ రోజులలోని చిన్ననాటి జ్ఞాపకాలు మళ్ళీ కళ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు.క్లాస్ రూమ్ లోని ఆత్మీయత, పాఠాల మధ్యలోని నవ్వులు, చివాట్లు, దాగిన ప్రేమానురాగాలు ఇవన్నీ మళ్ళీ మధురంగా మిగిలిపోయాయన్నారు. ఒక్కటైన మనం ఒక్కటిగా మళ్లీ ఆ జ్ఞాపకాల క్షణాల్లోకి ప్రయాణించాలన్నారు. గురువు అనేవాడు జ్ఞానం ఇస్తాడని జ్ఞాపకాలని కూడా పంచుకుంటాదన్నారు. సుభాషిణి ఇతర గురువులకుమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## దిల్‌సుక్ నగర్ సాయిబాబా ఆలయంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



సాయిబాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**హుడా కాంప్లెక్స్, జూలై 10, ప్రభాతవార్త:** గురు పౌర్ణమి సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది.గురుపూర్ణిమ సందర్భంగా బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే పెద్దసంఖ్యలో భక్తులు దర్శనం కోసం ఆలయానికి తరలివచ్చారు.సాయి నాథుని దర్శనానికి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి భక్తులు, తమ ఇష్ట దైవం సాయి బాబా ను దర్శించు కోవడం జరిగింది. సాయి సంస్మరణ తో ఆలయంలో ఆధ్యాత్మిక త నిండిన వాతావరణం ఏర్పడింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మహేశ్వరం మాజి ఎమ్మెల్యే తీగల కృష్ణ రెడ్డి తదితరులు బాబావారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వృద్ధులు, వి ఐ పి ల కొరకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.



గాంధీనగర్‌లోని అమ్మవారి దేవాలయం నిర్వాహకులకు బోనాల చెక్కును అందజేస్తున్న సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

## వికలాంగుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత : చైర్మన్ వీరయ్య



చైర్మన్ ముత్తినేని వీరయ్యను సన్మానిస్తున్న నాయకులు ,కార్యకర్తలు

**మలక్ పేట ,జూలై 10, ప్రభాతవార్త:** వికలాంగుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ గా ముత్తినేని వీరయ్య ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మలక్ పేట నల్గొండ చౌరస్తా లోని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపినందుకు వికలాంగుల సంఘాల ఆధ్వర్యంలో చైర్మన్ ముత్తినేని వీరయ్య కు పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ వికలాంగుల అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులందరి సహకారంతో వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని వివరించారు. వికలాంగులకు ఉన్నత విద్య లో 5 శాతం రిజర్వేషన్ ఇవ్వడం జరిగిందని , రాజీవ్ యువ వికాసం ద్వారా వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించి దాదాపు 300 కోట్లతో సుమారు 23 వేల మంది వికలాంగులకు స్వయం ఉపాధి పొందే అవకాశాన్ని కల్పించడం జరిగిందని వివరించారు. దేశ చరిత్రలో మొదటి రాష్ట్రంగా వికలాంగుల ఉచితంగా అందించే సహాయం ఉపకరణాలను 40 బెంచ్ మార్క్ వైఫల్యం వికలాంగులకు అందించేలా చట్టం చేసి అములు చేస్తున్నామని తెలిపారు. వికలాంగులకు కోర్టులలో నాలుగు శాతం రిజర్వేషన్లు, వికలాంగుల కార్పొరేషన్ ఉద్యోగులకు పిఆర్సీలు అందించడానికి చట్టం చేయడం జరిగిందని తెలిపారు . ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో వికలాంగులకు అయిదు శాతం రిజర్వేషన్లు, స్పోర్ట్స్ పాలసీలో వికలాంగులకు భారీ పారితోషికాలు ఇస్తున్నామని తెలిపారు. వికలాంగులను వికలాంగులు వివాహం చేసుకుంటే కళ్యాణ లక్ష్మితో పాటు అదనంగా ఒక లక్ష రూపాయలను ప్రోత్సాహంగా ఇస్తున్నామని తెలిపారు. వికలాంగుల హక్కుల చట్టం 2016 సెక్షన్ 92 అములు అయ్యేలా డిజిపికి లేఖ రాయడం జరిగిందని వివరించారు. దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్‌లో బూత్ స్థాయి అధికారుల జాతీయ శిక్షణా శిబిరం



బిఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

**హుడా కాంప్లెక్స్, జూలై 10 , ప్రభాతవార్త:** కందుకూరు ఆర్డీఓ జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో సరూర్ నగర్ మండలం తహసీల్దార్ (ఇ ఆర్ ఓ) వేణుగోపాల్ పర్యవేక్షణలో గురువారం సరూర్ నగర్ లోని జ్యోతి క్లబ్ లో బూత్ స్థాయి అధికారుల కు శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికీ రెవిన్యూ అధికారులు నజర్ నక్షా, ప్రవర్తన నియమావళి, కొత్త ఓటర్ల నమోదు,మరణించిన వారి ఓటర్ల తొలగింపు, 18 ఏళ్ల వారికి ఓటు హక్కు కల్పించడం లాంటి అంశాలపై శిక్షణను ఇచ్చారు. పోలింగ్ బూత్‌లో బూత్ స్థాయి ఏజెంట్లతో సమన్వయం కలిగి ఉండాలని, తన పోలింగ్ బూత్ లోని పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరుకు అవగాహన కల్పించాలని సూచించారు . ఓటు హక్కు కలిగి చిరునామా మారిన వారిని గుర్తించడం, వికలాంగులకు, వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ కలిగేలా సహాయపడే విధాననాని వివరించారు. ఆనంతరం ఎన్నికల నియమావళి గురించి బూతు స్థాయి అధికారులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి (ఎఇఆర్ఓ) శ్రీనివాసరావు,నాయబ్ తహసీల్దార్ జంగయ్య,ఆర్ఐ సహదేవ్ రెడ్డి, శోభన, సూపర్వైజర్లు ఆనంద్ కుమార్, మకత్ లాల్, చెవుల నవీన్, ప్రవీణ్, నవీన్, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**నేరేడ్‌మెట్, జూలై 10,ప్రభాతవార్త :** గురు పౌర్ణమి నీ పురస్కరించుకొని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.గురువారం మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్థానిక బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తల తో కలసి మల్కాజ్గిరి నియోజకవర్గంలోని వినాయక్ నగర్ డివిజన్ సమతా నగర్ శిరిడి సాయిబాబా దేవాల యం, ఓల్డ్ నేరేడ్మెట్ రామ్ మందిరం సమీపంలో గల సాయిబాబా దేవాలయం,విమల దేవి నగర్ సరస్వతి మధు శర్మ దంపతుల నివాసంలో, సాయి నగర్ అనుటెక్స్ సమీపంలో సాయిబాబా దేవాలయలకు వెళ్లి శ్రీ సాయిబాబా భగవాన్ ను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బద్దం పరుశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న,మురుగేష్, వీరేశం యాదవ్, చింతల మల్లేష్, మండల రాధాకృష్ణ,చిన్న యాదవ్, భాగ్యానంద్, హేమంత్ పటేల్,సురేష్, ఉపేందర్, బాలకృష్ణ, ఫరీద్ , శేఖర్ గౌడ్, సర్వేశ్ యాదవ్, మల్లేష్ యాదవ్, శివ గౌడ్,వంశీ, రాజశేఖర్ రెడ్డి, సాయి గౌడ్, సుమన్ గౌడ్, కోటేష్ , జనార్దన్ , నవీన్,అరుణ్ , వాసు, సందీప్, ఆయ ఆలయ కమిటీల సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు : రాచకొండ సిపి సుధీర్ బాబు



**నేరేడ్ మేట్,రాచకొండ కమిషనరేట్, జూలై 10 ప్రభాతవార్త**

దళారులను నమ్మి మోసపోవద్దని ఫార్మాసిటీ రైతులకు రాచకొండ సిపి సుధీర్ బాబు సూచించారు. గురువారం సీపీ జి సుధీర్ బాబు ఐపీఎస్ రాచకొండ బెగరికంచ గ్రామంలోని ఏటీసీ సందర్శించడం జరిగింది. అక్కడ ఫార్మా సిటి రైతులకు డిస్ట్రిబ్యూట్ చేస్తున్న ప్లాట్లను దానికి ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించి అధికారులతో మాట్లాడారు, హెల్ప్ డెస్క్ లను, గ్రీవిఎన్స్ కౌంటర్లను సిపి స్వయంగా పరిశీలించడమైనది, ఈ సంధర్భముగా సిపి మాట్లాడుతూ.. పాట్లు డిస్ట్రిబ్యూషన్ పారదర్శకముగా ఉండాలని, దళారులతో మోసపోవద్దు అని రైతులకు సూచించారు, ఎటువంటి గ్రీవెన్స్ వచ్చాయో కూడా రిజిస్టర్ను చెక్ చేసి ఏదైనా సమస్య వస్తే అధికారుల దృష్టికి తీసుకరావాలని, దళారుల చేతిలో మోసపోకూడని రైతులకు సూచనలు చేశారు. శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా గట్టి బందో బస్తు ఏర్పాటు చేశాం అని ఆయన తెలిపారు. అనంతరం కొంతమంది రైతులతో మాట్లాడి వారి యొక్క అభిప్రాయాలను తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపి గారి వెంట మహేశ్వరం డిసిపి శ్రీమతి సునీత రెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసిపి కేపివి రాజు, హైద్రాబాద్ గ్రీన్ ఫార్మసిటీ ఇన్స్పెక్టర్ లిక్కి కృష్ణం రాజు, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## లోక కళ్యాణం కోసం గురువు మార్గదర్శనం నేటి సమాజానికి అవసరం

### ద్వారకామాయి పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ



బాబాకు మహా హారతినిస్తున్న ద్వారకామాయి పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ



ద్వారకామాయి సాయిబాబా పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీని సన్మానిస్తున్న భక్తులు

**సరూర్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** లోక కళ్యాణం, విశ్వశాంతి కోసం అజ్ఞాన అంధకారాన్ని తొలగించే గురువు మార్గదర్శనం నేటి సమాజానికి అవసరమని శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన దత్త సిద్ధాంత ఆదికర్త, శ్రీద్వారకామాయి సాయిబాబా పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రశాంతిహిల్స్ లోనున్న ఆధ్యాత్మిక నిలయం శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠంలో గురువారం గురు పౌర్ణమి, గురు పూజోత్సవ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. పీఠాధిపతి మంగళ శాసనములతో నిర్వహించిన మహోత్సవంలో భాగంగా ఉదయం సాయిబాబాకు కాకడ హారతి, మంగళ స్నానం అనంతరం నమక చమకమల ఈశ్వరాభిషేకం, మధ్యాహ్నం సత్సంగం, ఆధ్యాత్మిక సందేశాలు, భక్తి గీతాలాపన అనంతరం భక్తులకు బాబా మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్బంగా భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ గురువారం గురు పౌర్ణమి రావడం విశేషమని వ్యాఖ్యానించారు. మనుష్యుల్లోని అజ్ఞానమనే చీకటిని తొలగించి విజ్ఞానమనే దీపాన్ని వెలిగించే గురువును విస్మరించవద్దనీ గురువులను గౌరవించని సమాజం ఎప్పటికీ బాగుపడదని అన్నారు. గురు బోధనలను అనుసరిస్తూ ముందుకు సాగాలని స్వామీజీ పిలుపునిచ్చారు. తత్వవేత్త అయిన గురువులను మార్గదర్శనం చేసుకుంటే సత్ఫలితాలుంటాయని పీఠాధిపతి పేర్కొన్నారు.

**కనులపండువగా గురు పూజోత్సవం**

కాగా ద్వారకామాయి సాయిబాబా పీఠంలో గురు పూజోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ప్రతి రోజూ బోధనల ద్వారా సమాజంలో మంచి మార్పు, ఆధ్యాత్మిక చింతన పెంపొందిస్తూ మార్గదర్శకులుగా నిలుస్తున్న పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీని పలువురు సన్మానించి పాదపూజ చేశారు. దక్షిణ షిరిడీ దిల్‌సుఖ్‌నగర్ సాయి బాబా ఆలయ మాజీ చైర్మన్లు కొలిశెట్టి లక్ష్మయ్య, వనం రంగయ్య, బాలాపూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి, విశ్రాంత మున్సిపల్ కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్‌లతో పాటు అబ్బూరి సుధాకర్, బుర్రా కృష్ణమోహన్, చిట్టు రాధాకృష్ణ, రంగనాథ్, ఎస్‌పి శాస్త్రి, అనితారెడ్డి, జమునా రెడ్డి, అపర్ణారెడ్డి, లలిత్‌సాయి, మల్లాది విజయశ్రీ, జయలక్ష్మి, సుందరలక్ష్మి తదితరులు స్వామీజీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, మాజీ కార్పొరేటర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, పసునూరి బిక్షపతిచారి, భీమ్‌రాజ్, నాయకులు కోడూరు సోమేశ్వర్, ద్యాసాని తిరుపతిరెడ్డి రమేష్ ముదిరాజ్, బాబా భక్తులు వంజరి మహేష్, చారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి సందర్భంగా పేద మహిళలకు చీరల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న జిట్టా రాజశేఖర్ రెడ్డి, వినోద్ రెడ్డి.

**వనస్థలిపురం జూలై.10.ప్రభాతవార్త :** .గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ సద్గురు భం అన్వారానంద బాబా వనస్థలిపురం సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వాహకులు బద్దం వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో వనస్థలిపురం గణేష్ దేవాలయం సమీపంలో సద్గురు భం అన్వారానంద బాబా చిత్రపటానికి పూజలు జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, బి.యన్.రెడ్డి మాజీ కార్పొరేటర్ ముద్దాని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్‌లు పారిశుద్ధ్య మహిళ కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కుంట్లూర్ వెంకటేష్ గౌడ్, కొత్త రఘు గౌడ్ ,వెంకీ ,సంజీవరెడ్డి, మిట్ట కంటి సత్తిరెడ్డి, సుజిత్, శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్ నాయుడు ,నర్సింగ్, సుధాకర్ రెడ్డి ,లక్ష్మణ్ గౌడ్, సుబ్బారాయుడు, పెద్ది రాములు పాల్గొన్నారు.

## అభయగణపతి శివాలయంలో పూజలు



**నేరేడ్ మెట్,జూలై 10,ప్రభాతవార్త.** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మోలాలి జెడ్ టి సి లో శ్రీ అభయ గణపతి శివాలయం హనుమాన్ సాయిబాబా భ్రమరాంబిక దేవి దేవాలయం గుడిలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ట్రెజరర్ కృష్ణ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పి. శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ, అన్నదాతలైన కృష్ణ కుటుంబ సభ్యులపై సాయిబాబా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఐఎస్ సదన్‌లో బోనాల చెక్కుల పంపిణీ



దేవాలయాల నిర్వాహకులకు చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 10 ప్రభాతవార్త:** బోనాల ఉత్సవాలకు సంబంధించి జిహెచ్ఎంసి నుంచి ఐఎస్ సదన్ డివిజన్‌లోని వివిధ దేవాలయాలకు మంజూరైన చెక్కులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి గురువారం అమ్మవారి దేవాలయాల నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణా సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. డివిజన్‌లోని అమ్మవారి దేవాయాలను బోనాల పండుగకు ప్రత్యేకంగా ముస్తాబు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయాల నిర్వాహకులతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి దంపతులు

**సైదాబాద్, జూలై 10 ప్రభాతవార్త:** గురుపూర్ణిమ సందర్భంగా సైదాబాద్, ఐఎస్ సదన్, చంపాపేట, లింగోజిగూడ, కుర్మగూడ డివిజన్లలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు దేవాలయాలకు తరలివచ్చి పూజలు నిర్వహించారు. లక్ష్మినగర్‌లోని శ్రీ షిర్డీసాయిబాబ దేవాలయంలో గురుపూర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి దంపతులు డివిజన్‌లోని పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో దేవాలయాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం, గురుపౌర్ణమి వేడుకలు



దివ్యశ్రీ రమణచక్రవర్తుల ఆశీస్సులు తీసుకుంటున్న భక్తులు

**ఎల్.బి.నగర్, జూలై 10 ప్రభాతవార్త:** చైతన్యపురి డివిజన్ ఫణిగిరికాలనీలోని శ్రీలక్ష్మీనారాయణ సేవా సమితి ప్రాంగణంలో గురుమాతాశ్రీ దివ్యశ్రీ రమణచక్రవర్తుల వారి ప్రత్యేక పర్యవేక్షణలో గురుపౌర్ణమి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా సుదర్శన హోమము, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్య భగవానుడి నుంచి ఉద్భవించిన సుదర్శన చక్రం ఆయుధానికి 1008 రూపంతో కూడిన అంచులు ఉన్నాయని, సుదర్శన చక్రాన్ని కోటి సూర్య ప్రభల శక్తిని కలిగి ఉంటుందన్నారు. శత్రువులపై విజయం సాధించడం దుష్టశక్తుల పీడ నుంచి విరగడవుతుందని శరీరం శుద్ధికరణ జరిగి శక్తిని ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. భక్తులు పెద్దఎత్తున హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాగా భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి డైరెక్టర్ వెంకటరమణ చార్యులు, ఆనంద్ మసాలా అధినేత శివానంద అగర్వాల్, గోపిదేని చంద్రశేఖరరావు, హిమారెడ్డి, డాక్టర్ శివప్రసాద్, జిగిని పావని, తీగల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



గురుపౌర్ణమి పర్వదిన సందర్భంగా బాలాజీ నగర్లో గల స్ర శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బి.ఎన్. రెడ్డి.నగర్ డివిజన్ బి.ఆర్.ఎస్. పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ ముడుపు సందీప్ రెడ్డి,అనిల్ చౌదరి, సుమన్ గౌడ్,రాఘవేంద్రరావు తదితరులు.(ప్రభాతవార్త... వనస్థలిపురం).



వనస్థలిపురం డివిజన్ లోని ప్రశాంత్ నగర్ లో గల శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి,వేములయ్య గౌడ్ తదితరులు.( ప్రభాతవార్త వనస్థలిపురం.).



గురుపౌర్ణమి పర్వదిన సందర్భంగా బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ ,శ్రీ గాయత్రీ నగర్ బ్యాంక్ కాలనీలో గల శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ ముద్ద గౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్.భవానీ ఎన్‌క్లేవ్ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్,సరస్వతి, మారుతి, పద్మ,శ్రీ దేవి,శేఖర్ తదితరులు.(ప్రభాతవార్త వనస్థలిపురం.)

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి : కార్పొరేటర్ సుజాత నాయక్



మేయర్‌కు మెమెంటో అందజేస్తున్న కార్పొరేటర్ సుజాత నాయక్.

**వనస్థలిపురం. జూలై.10.ప్రభాతవార్త.** హస్తినాపురం డివిజన్ లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు గాను నాలుగు కోట్ల రూపాయలను మంజూరు చేయాలని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ గారు కోరారు జిహెచ్ఎంసి కార్యాలయంలో గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని డివిజన్ పరిధిలో ని పలు కాలనీలలో సిసి రోడ్ల నిర్మాణానికి నాలుగు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్య చేయాలని కోరారు ఇందిరా క్యాంటీన్ ద్వారా ఐదు రూపాయల భోజన మరియు టిఫిన్ పథకం టీకేఆర్ చౌరస్తా వద్ద మరియు హస్తినాపురం సెంట్రల్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేయుటకు ప్రతిపాదన సిద్ధం చేయాలని అధికారులను కోరడం జరిగింది దానికి అధికారులు సానుకూలంగా స్పందించినట్టు ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు తెలపడం జరిగింది . అదే విధంగా హస్తినాపురం డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్, గణేష్ నగర్, శ్రీ రమణ కాలనీ, అగ్రికల్చర్ కాలనీ, విశ్వేశ్వరయ్య కాలనీలో రోడ్లకు సంబంధించి నాలుగు కోట్ల నిధులు మంజూరు చేయాలని దానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు హస్తినాపురం డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ఏకైక లక్ష్యం అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి నేటి వరకు సుమారు 50కోట్లతో వివిధ అభి వృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయడమే కా కుండా పనులు కూడా ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు సందర్భంగా మేయర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

## బోనాలు, తొట్టెల ఊరేగింపును ప్రశాంతంగా జరుపుకోవాలి : యెల్మేటి అమరేందర్‌రెడ్డి



యెల్మేటి అమరేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న బాలాపూర్ యూత్ సభ్యులు

**సరూర్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ గ్రామంలో ఈ నెల 17వ తేదీ గురువారం జరిగే బోనాల పండుగను మరుసటి రోజు 18వ తేదీ శుక్రవారం జరిగే తొట్టెల ఊరేగింపును ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి సూచించారు. బాలాపూర్ గ్రామానికి చెందిన ఆల్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు గురువారం అమరేందర్‌రెడ్డిని కలిసి బోనాల జాతర, తొట్టెల ఊరేగింపుకు హాజరుకావాలని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన పండుగలను మంచి వాతావరణంలో జరుపుకొని వాటి ఖ్యాతిని పెంచాలని అన్నారు.కార్యక్రమంలో యూత్ సభ్యులు ప్రశాంత్ కుమార్, బాలరాజ్,అరవింద్,శివ,సురేష్ నాగేందర్‌లు పాల్గొన్నారు.

## జిల్లెలగూడ పోచమ్మ ఆలయంలో గురువుకు పాదపూజ



శేషాచార్యులు గురువుకు పాదపూజ చేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ నల్ల పోచమ్మ ఆలయంలో గురువారం రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కోమాండూరి శేషాచార్యులు గురువును సత్కరించి పాదపూజ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గంగాపురం వెంకట్‌రెడ్డి, యెల్మేటి దేవేందర్‌రెడ్డి, తులసి ముఖేష్ ముదిరాజ్, పసునూరి బిక్షపతిచారి, కీసర గోవర్ధన్‌రెడ్డి, మద్ది రాజశేఖర్‌రెడ్డి, కోదూరు సోమేశ్వర్, గాజుల మధులతో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, పాల్గొన్నారు.